ప్రజాశక్తి

గురువారం 21 మార్చి 2024 | 5 | విజయనగరం



350 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శంగవరపుకోట/విజయనగరం కోట

సుమారు రూ.50లక్షల విలువైన 350 కేజీల గంజాయిని లారీ క్యాబిన్ లో పెట్టి గుట్టుగా తరలిస్తుండగా ఎస్.కోట ఎస్ఇబి అధికారులు, సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎఇసి డివిజి రాజు, సిఐ సంతోష్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. లారీకి ప్రత్యేక క్యాబిన్ తయారు చేసి అందులో తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో మాటు వేసి పట్టుకున్నామని తెలిపారు. హర్యానా రాష్ట్రానికి చెందిన లారీలో విశాఖ వైపు వెళ్తుండగా ఎక్సైజ్ సిబ్బంది నిలుపుదల చేసి తనిఖీ చేశారు. డ్రైవర్ సీటు పైనున్న టాప్ బోనెట్ లో సుమారు 150 ప్యాకెట్లలో సుమారు 350 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించి విచారణ చేపడుతున్నట్టు వెల్లడించారు. విజయనగరంలోని రైల్వేక్వార్టర్స్ వద్ద ఓ వ్యక్తి నుంచి 9 కేజీల గంజాయిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన కర్నాటక రాష్ట్రం మంగుళూరు ప్రాంతానికి చెందిన వాడని సిఐ వెంకటరావు తెలిపారు.

టిడిపిలో గ్రూపుల గోల

- టిక్కెట్లు రాక కొందరు
- పొత్తుతో నష్టమని మరికొందరు



టిడిపిలో విజయనగరం, బొబ్బిలి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రూపుల గోల రోజురోజుకూ బిగుసుకుంటోంది. ఆ పార్టీలోని అంతర్గత రాజకీయాలు ముదరపాకాన పడుతున్నాయి. విబేదాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. టిక్కెట్లు రాకపోవడం వల్ల కొందరు కినుక వహించగా, జనసేన, బిజెపితో పొత్తుకారణంగా మరికొందరు టిడిపి నేతలు అలకబూనారు. అభ్యర్థులు మాత్రం ఇవేవీ పట్టించుకో కుండా ముందుకు సాగుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు టిడిపి, జనసేన అభ్యర్థులను ఫిబ్రవరి 24న ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గజపతినగరంలో టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ప్రచారంలో దూసుకుపోతున్నప్పటికీ, సీటు ఆశించి భంగపడ్డ కెఎ నాయుడు ఇంకా ప్రచారంలో కలిసిరాలేదు. తాను శ్రీనివాస్‌కు సహకరించే పరిస్థితే లేదని బాహాటంగానే చెబుతున్నారు. పున:పరిశీలనలో భాగంగా తనకు సీటు వస్తుందంటూ కేడర్‌ను శ్రీనివాస్‌తో వెళ్లనీయకుండా అడ్డుపడుతున్నారు. మరోవైపు శ్రీనివాస్, ఆయన అనుచరులు మాత్రం కొద్ది రోజుల్లో అన్నీ సమసిపోతాయని దీమా వ్యక్తం చేస్తున్నారు. నేతల మధ్య నెలకొన్న అనైక్యతను వైసిపి తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. చీపురుపల్లిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జునను పక్కనబట్టి మాజీ మంత్రులు గంటా లేదా కిమిడి కళావెంటరావులను పోటీ చేయించేందుకు అధిష్టానం ప్రయత్నిస్తోంది. ఈ ఇద్దరు నేతలూ ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పోటీలో ఎవరు నిలుస్తారో తెలియక కేడర్ అయోమయంలో ఉంది. అభ్యర్థి ఎవరనేది తేలే లోపే రాజకీయాలను తనకు అనుకూలంగా మలుచుకునే పనిలో వైసిపి నుంచి ఇక్కడ బరిలో దిగబోతున్న మంత్రి బొత్స సత్యనారాయణ స్పీడు పెంచారు. రాజాం అభ్యర్థి కొండ్రు మురళీ, టిడిపి సీనియర్ నేత కావలి ప్రతిభా భారతి మధ్య చాలా కాలంగా అంతర్గత విభేదాలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు ప్రతిభా భారతి గ్రూపునకు సీనియర్ నేత కిమిడి కళావెంకటరావు పరోక్షంగా అండదండలందించారు. ప్రస్తుతం ఆయన ఆశిస్తున్న ఎచ్చెర్లలో సీటు ఖరారు కాలేదు. దీంతో, ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ స్వరం తగ్గినప్పటికీ ఇప్పటికీ కోండ్రు మురళీ తరపున ఎన్నికల ప్రచారానికి వెళ్లడం లేదు. ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ మధ్య గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇద్దరూ సీటు కోసం ఆశపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల లోకేష్ పర్యటనలో ఈ రెండు గ్రూపుల మధ్య పెనుగులాట వరకు వెళ్లిన సంగతి విధితమే. పరిస్థితి ఇంకా అలాగే కొనసాగుతోంది. ఇటు నెలిమర్లలో పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటు జనసేనకు వెళ్లడం, పార్లమెంట్ సీటు బిజెపికి పోయే పరిస్థితి ఏర్పడడంతో టిడిపి కేడర్ అంతర్మధనంలో ఉంది. ఈ నియోజకవర్గంలోనూ అంతర్గతంగా రెండు గ్రూపులు ఉన్నాయి. ఇందులో ఒక గ్రూపు వైసిపికి సహకరించే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టే నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజు మౌనం వీడడం లేదు. జనసేన అభ్యర్థికి మద్ధతుగా ప్రచారానికి వెళ్లడం లేదు.

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరులో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మధ్య దీర్ఘకాలికంగా కొనసాగుతునే ఉన్నాయి. తొలి నుంచీ వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసికట్టుగా పనిచేసే పరిస్థితి లేదని సాక్షాత్తు టిడిపి కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. వీరి అనైక్యత వైసిపికి వరంగా మారబోతుందని కూడా చర్చనడుస్తోంది. పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు ఇప్పుడిప్పుడే అసంతృప్తి నుంచి బయటపడినప్పటికీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ద్వారాపురెడ్డి జగదీష్, అభ్యర్థి విజయ చంద్ర ఒకరినొకరు పట్టించుకోవడం లేదు. ఈరకమైన మనస్పర్థలను తనకు అనుకూలంగా మలుచుకునే పనిలో వైసిపి నిమగ్నమైంది. కురుపాంలో మరో విచిత్రమైన పరిస్థితి. అభ్యర్థి తోయక జగదీశ్వరికి సీనియర్ నేత, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆశీస్సులు ఉన్నప్పటికీ ఆయన వృద్ధాప్యంలో వున్నారు. ఆయన ప్రియశిశ్యుడు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు మరో నాయకుడికి టిక్కెట్ వస్తుందని ఆశించారు. ఖంగుతిన్న ఆయన ఇప్పటికీ జగదీశ్వరి తరపున ప్రచారంలో పాల్గొనకపోవడంతో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అటు పాలకొండ నియోజకవర్గంలో మొత్తం ఆరుగురు ఆశావహులు ఉండడంతో అభ్యర్థి ఎవరనేది నేటికీ అధిష్టానం తేల్చలేని పరిస్థితి నెలకొంది.

విస్తారంగా వర్షాలు

ప్రజాశక్తి-విజయనగరం/పాలకొండ

బంగాళా ఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అడపా దడపా వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడా మొక్కజొన్నకు స్వల్ప నష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా చీపురుపల్లి మండలంలో 136.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా రామభద్రపురం, వేపాడ, కొత్తవలస మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. గరివిడి మండలంలో 131.2మి.మీ, దత్తిరాజేరు 53.2మి.మీ, మెరకముడిదాం 36, మెంటాడ 34.2, గజపతినగరం 32.4, బొండపల్లి 32, సంతకవిటి 28.2, విజయనగరం 23.6, గుర్ల 20.8, రేగిడి 18.8, తెర్లాంలో 18.6, డెంకాడ 16.2 మి.మీ. వర్షం కురిసింది. తక్కువగా నెల్లిమర్లలో 8.6, బాడంగి 8.2, వంగర 6.6, బొబ్బిలి 4.4, గంట్యాడ 3.8, భోగాపురం 3.6, పూసపాటిరేగ 2.8, లక్కవరపుకోట, శృంగవరపుకోట, జామి మండలాల్లో 2.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు కొంత అసౌకర్యానికి గురయ్యారు. గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడికి కొంత నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సీతంపేటలో కూడా వర్షం కురిసింది.



పాలకొండలో కురుస్తున్న వర్షం

పిడుగు పడి 35 గొర్రెలు మృతి

తెర్లాం : మండలంలోని వి.చిన్నయ్యపేట గ్రామంలో పిడుగు పడి 35 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి వెన్నెల రాము బుధవారం ఉదయం గొర్రెలను మేపునకు తీసుకొని పొలంలోకి వెళ్లాడు. గొర్రెలు మేత మేస్తుండగా, ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దూరం నుంచి చూస్తుండగానే పిడుగు పడి మృతి చెందాయని రాము ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



మృతిచెందిన గొర్రెలు

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్ మీద రెండు రోజులు పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థుల వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈ సదస్సుకు ఎమ్‌కోర్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాయిశ్రీనివాస్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రెండు రోజుల కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ మూడోవ సంవత్సరం విద్యార్థులు, ఎలక్ట్రికల్ అధ్యాపక బృందం పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేశారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హరిబాబు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్య, ఇన్చార్జి విభాగాధిపతి డాక్టర్ బి.వి.ఎస్ ఆచార్యులు, డాక్టర్ పి.జానకి, టి.పాపి నాయుడు, విజయ్ చంద్ర, బి.రామ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

నోటి శుభ్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 20 నుంచి జరుగుతున్న నోటి శుభ్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20నుంచి వచ్చేనెల 20వరకు జరుగుతున్న నోటిశుభ్రతా మాసోత్సవాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి, సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లి నోటి శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ మొదలైన వాటిపై డెమో ఇవ్వాలని తెలిపారు. బ్రష్ చేసేటప్పుడు 2 నుంచి 3 నిముషాలు మాత్రమే చేయాలని, ఉదయం, రాత్రి భోజన అనంతరం రెండు దపాలు బ్రష్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి.రవికుమారి, డెమో సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని కారణంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న బుధవారం సాలూరు మండలం వెలగవలసలో చోటుచేసుకుంది. వెలగవలసకు చెందిన జన్ని రమేష్ (21), తోణాం పంచాయతీ దిగువమండంగికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని అనుకున్న తరుణంలో పెద్దలు వీరి వివాహానికి అంగీకరించలేదు. దీంతో రమేష్ బుధవారం ఉదయం వెలగవలస గ్రామంలో తన పొలంలో పురుగుల మందు తాగాడు. అనంతరం తన అన్నయ్యకు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా చేరవేశాడు. కొన ఊపిరితోనున్న రమేష్‌ని తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

గ్రామాన్ని ఖాళీ చేసే పరిస్థితి తేవొద్దు

- కొత్త క్వారీ ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులను వేడుకున్న గ్రామస్తులు
- పాఠశాల సమీపంలో క్వారీ ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి-భోగాపురం

గ్రామానికి ఆనుకొని ఉన్న మూడు క్వారీలతోనే ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఇప్పుడు కొత్తగా మరొకటి ఏర్పాటు చేసి గ్రామాన్ని ఖాళీ చేసివెళ్ళిపోయే పరిస్థితి తీసుకురావద్దని అధికారులకు రామచంద్రపేట గ్రామస్తులు వేడుకున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా జిఎమ్ఆర్ సంస్థ రామచంద్రపేట గ్రామానికి ఆనుకొని కొత్తగా క్వారీ ఏర్పాటుకు అనుమతులు పొందింది. దీనికోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిధిగా జిల్లా రెవెన్యూ అధికారి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను చెప్పాలని గ్రామస్తులను ఆమె కోరారు. గ్రామస్తులు దుక్క రమణ, కోలా రామసూరి, సుగ్గు పోలిరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి ఆనుకొని ప్రస్తుతం మూడు క్వారీలు ఉన్నాయన్నారు. బాంబుల పేలుళ్లతో ఇప్పటికే గ్రామస్తులు నరకం చూస్తున్నారని తెలిపారు. ఇళ్లకు బీటలు వారుతున్నాయన్నారు. ఇప్పుడు కొత్తగా మరో క్వారీని ఏర్పాటు చేయడం దారుణమని అన్నారు. అంతేకాక ఇప్పుడు ఏర్పాటు చేయనున్న క్వారీ పాఠశాలకు ఆనుకొని ఉన్నందున విద్యార్థులు కూడా చాలా ఇబ్బందులు పడతారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది సతీష్, సామాజిక కార్యకర్త రామారావు మాట్లాడుతూ ఇక్కడ క్వారీ ఏర్పాటు చేయడం గ్రామస్తులకు ఎంతమాత్రం ఇష్టం లేదని అన్నారు. అంతేకాక సుమారు రూ.190 కోట్లు విలువైన క్వారీయింగ్ చేసి కేవలం మూడు నాలుగు లక్షల సిఎస్ఆర్ గ్రాంట్ ఇస్తామనడం దారుణమని అన్నారు. అంతేకాక ఈ ప్రాంత రహదారులు కూడా దెబ్బతింటాయన్నారు. గ్రామ వాలంటీర్లు ఇప్పిలి గోవిందు, నొడగల రమణ, పిట్ట బాలాజి మాట్లాడుతూ గతంలో గ్రామానికి ఆనుకొని ఉన్న క్వారీ మూసి ఉండడంతో అక్కడ సుమారు కోటి రూపాయలతో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం నిర్మిస్తామని తెలిపారని, క్వారీ ప్రారంభించిన తరువాత వీటిని ప్రారంభించ కుండా కోర్టు నుంచి స్టే తెచ్చి నిలుపుదల చేశారని అన్నారు. యువకులు దుక్క రాము, దుక్క నర్సిమ్మ, నీలాద్రి బాలక్రిష్ణ, దువ్వు బంగార్రాజు మాట్లాడుతూ క్వారీల ప్రభావంతో తాగునీరు కలుషితమైందని, అనేక మంది కిడ్నీల సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా క్వారీల నుంచి వస్తున్న దూళితో చిన్న పిల్లల్లో, పెద్దల్లో ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పెదకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన సూరాడ చిన్నారావు మాట్లాడుతూ మా గ్రామనికి వెళ్లే రహదారిలో క్వారీతో చాలా అవస్థలు పడుతున్నామన్నారు. త్వరలో గ్రామస్తులతో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ అనిత మాట్లాడతూ సమస్యలన్నీ పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్తులకు తెలిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. సమావేశంలో తహశీల్దారు శ్యామ్ ప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, ఎస్.ఐ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



క్వారీ ఏర్పాటు చేయవద్దని కోరుతున్న గ్రామ వాలంటీరు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

కనకమహాలక్ష్మి ఆలయ ఆదాయం రూ.22.39 లక్షలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆదాయం భక్తుల నుంచి వివిధ రూపాల్లో రూ.22,39,349 ఆలయ కార్య నిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,42,473 ఎక్కువ వచ్చిందని చెప్పారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో అమ్మ వారి జాతర జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ మూడు రోజుల పాటు భక్తుల నుంచి వివిధ రూపాల్లో రూ.22,39,349 ఆదాయం వచ్చిందని తెలిపారు. టికెట్ల ద్వారా రూ. 9,45,248, హుండీ ద్వారా రూ.12,85,101 వచ్చిందన్నారు. బుధవారం సూపరింటెండెంట్ విజయ్ కుమార్ , సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, పివి లక్ష్మి, ఆలయ ఛైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశరావు, వైస్ ఛైర్మన్ సూరు కుమార్ ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో ఆదాయం లెక్కించామని ఇఒ తెలిపారు.

జెఎన్‌టియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెల్త్ కేర్ క్యాంప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు ఆధ్వర్యంలో బుధవారం గొట్లాం గ్రామంలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్-2 విద్యార్థులు ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఉప కేంద్రంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యునిట్-2 పిఒ డాక్టర్ బి.ధర్మారావు, ఉపకేంద్రంలోని ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

ప్రజాసేవే విజయానికి సోపానం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరంతర ప్రజాసేవ, నిబద్ధత గల అభివృద్ధే తన విజయానికి సోపానాలుగా నిలుస్తాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం స్థానిక పూల్‌బాగ్‌లోని శ్రీరస్తు కళ్యాణ మండపంలో పార్టీ విస్తతస్థాయి జోనల్ సమావేశం జరిగింది. జోనల్ ఇంఛార్జి ఎస్‌వివి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోలగట్ల మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేని అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచింది వైసిపి శ్రేణులనని గుర్తు చేశారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్న కొంతమంది దీనస్థితిని చూసి జాలి పడుతున్నానన్నారు. నగరంలో 11 వాటర్ ట్యాంకులను నిర్మించి 585 ఇంటర్ కనెక్షన్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామని అన్నారు. రహదారులను అభివృద్ధి చేసి సౌకర్యవంతమైన రోడ్లను ఏర్పాటు చేశామన్నారు. సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తనను మరోసారి గెలిపిస్తే సమస్యలేనని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జోనల్ ఇన్చార్జి ముచ్చు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బండారు ఆనందరావు, రాగాన రూపా దేవి, గదుల సత్యలత తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కమ్మవీధిలో పార్టీ కార్యాలయాన్ని కోలగట్ల ప్రారంభించారు. కమ్మ వీధిలోని పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, గుజ్జల నారాయణరావు, అల్లు చాణిక్య య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన అనుమతులను తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటికోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించడం జరగదని చెప్పారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి, ఒక చోట నుంచి మరో చోటకు ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించామని, విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. కొత్తగా ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు పెట్టాలన్నా, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇళ్లలో స్టిక్కర్లు అంటించాలన్నా, పాంప్లెట్లు పంచాలన్నా, ఆయా ఇళ్ల యజమానుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ, పంచాయతీల అనుమతి పొందిన హోర్డింగులను రాజకీయ పార్టీల ప్రచారానికి కేటాయిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, రేడియో, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్, డిజిటల్ బోర్డుల్లో ప్రకటనలు ఇవ్వాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఆటోలు, బస్సులు తదితర ప్రజా రవాణా వాహనాల్లో కూడా అనుమతి లేకుండా రాజకీయ పార్టీల స్టిక్కర్లు, బ్యానర్లు పెట్టకూడదని స్పష్టం చేశారు. పేపర్లలో ప్రకటనలు ఇవ్వడానికి ముందస్తు అనుమతి అక్కరలేదని, పెయిడ్ న్యూస్‌ను అభ్యర్థుల ఖాతాలో ఖర్చుగా రాస్తామని తెలిపారు.ఎంసిసి నిబంధనా వళిని డిపిఆర్ఒ డి.రమేష్, నోడల్ అధికారి అరుణశ్రీ, అభ్యర్థుల వ్యయ నిబంధనలను నోడల్ అధికారి అరుణకుమారి వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వెంకట త్రివినాగ్, ఆర్ఒలు, తాహశీల్దార్లు, డిటిలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ఫిర్యాదులకు సి-విజిల్ యాప్

కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం పబ్లిక్ యాప్ సి-విజిల్ ద్వారా స్వీకరిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో రెండు ల్యాండ్ లైన్ నెంబర్లను ఏర్పాటు చేసి సిబ్బందిని 24/7 ఫోన్ వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో కలెక్టర్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సి-విజిల్ యాప్‌లో మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు పంపవచ్చని తెలిపారు. పార్టీలకు చెందిన వారు మద్యం, నగదు, బహుమతులు వంటివి పంపిణీ చేసినా లైవ్ ఫోటో లు, వీడియోల ద్వారా ఈ యాప్‌లో పంపాలని తెలిపారు. ఈ యాప్ లో పెట్టిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. దీనితో పాటు 1950 కాల్ సెంటర్ నెంబర్ కు కూడా ఫిర్యాదులను చేయవచ్చని అన్నారు. కంట్రోల్ రూమ్ లో రెండు ల్యాండ్ లైన్ నంబర్ లను ఏర్పాటు చేసామని, 08922 -797120 , 09822-797124 నెంబర్లకు కోడ్ ఉల్లంఘన పై ఫిర్యాదులను , ఎన్నికల సమాచారం కోసం ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ప్రింట్ మీడియాలో వచ్చే పొలిటికల్ వార్తలను ప్రెస్ కౌన్సిల్ నిబంధనలకు లోబడి ఉండాలని స్పష్టం చేసారు. ఎలక్ట్రానిక్ మీడియా లో , సోషల్ మీడియాలో పొలిటికల్ ప్రకటనల కోసం వచ్చే వీడియో లకు, ఆడియోలకు ఎంసిఎంసి ప్రీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అందుకోసం 48 గంటల ముందే ఎంసిఎంసికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పక్షపాత రహితంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, మీడియా , ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఐపిఆర్ఒ డి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు బహుమతులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి రెండు రోజులు స్థానిక ఆర్‌టిసి డిపో ఆదాయానికి అధిక కృషి చేసి ప్రతిభ కనపరిచిన ఆర్‌టిసి సిబ్బందికి బహుమతులను అందజేశామని డిపో మేనేజర్ కె రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మాట్లాడుతూ మహాశివరాత్రికి స్థానిక ఆర్‌టిసి డిపో నుంచి పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వరాలయానికి, ధర్మవరం వద్ద గల సన్యాసేస్వర ఆలయాల దర్శనార్థం యాత్రికులకు ప్రత్యేక బస్సులను నడిపామని అయితే ఈ ప్రత్యేక బస్సులలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి రెండు స్థానాలలో నిలిచిన నలుగురు ఉద్యోగులకు ఎస్ కోట డిపో ఆర్‌టిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి కె. కోటేశ్వరరావు సౌజన్యంతో ప్రోత్సాహక బహుమతులను అందజేశామన్నారు. ఇందులో మొదటి స్థానంలో కండక్టర్ పి. శ్రీనివాసరావు, డ్రైవర్ ఆతవ శ్రీనివాసరావు, రెండవ స్థానంలో కండక్టర్ రాజేశ్వరి, డ్రైవర్ పి. గోపాలరావు బహుమతులను అందుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కె. కోటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేనిదే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు

విజయనగరం టౌన్: ఎన్నికల నిబంధనలు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేసినా, ఉద్యోగులు ఆయా రాజకీయ పార్టీలు ప్రచారంలో పాల్గొన్నా చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం..రాజకీయ పార్టీలు పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన 24 గంటల్లోగా ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్లు, బ్యానర్లు, జెండాలు మొదలైన వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశించామన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. వాటర్ ట్యాంకర్, పారిశుధ్య వాహనములు మరియు నగరపాలక సంస్థ వాహనాలపై కూడా రాజకీయ గుర్తులతో కూడిన స్టికర్లను తొలగించామన్నారు.

50వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల



మాట్లాడుతున్న టివి రమణ

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన సమ్మె బుధవారం నాటికి 50వ రోజుకు చేరుకుంది. స్థానిక ఆర్‌ఓబి వద్ద చేస్తున్న సమ్మెలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ మాట్లాడుతూ గత 50రోజులుగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు జనవరి నెల జీతాలు, డిఎ బకాయిలు, వేతన ఒప్పందం చేయాలని నిరశన సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. పని చేసిన కాలానికి జనవరి నెల జీతాలు ఇంతవరకు మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం, మిమ్స్ యాజమాన్యం స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించి జనవరి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కామునాయుడు, కె.మధు, గౌరి, మూర్తి, ఎం.నాగ భూషణం, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

గరివిడి: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ 'డాట్సోల్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్' లో ఉద్యోగ నియామకాల భర్తీ చేయడానికి వి టాలెంట్ సంస్థ ప్రతినిధులు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలకు బిటెక్ అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు అర్హులని అన్నారు. ఎంపికలకు తమ కాలేజీ నుండి 177 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డాట్సోల్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ టీమ్, సాంకేతిక నిపుణులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆప్టిట్యూడ్ టెస్ట్, జూమ్, మౌఖిక పరీక్షలు నిర్వహించి 57 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ప్రాంగణ ఎంపికలను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్, వైస్.ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి. అనిల్ కుమార్, కాలేజీ ప్లేసెమెంట్ అధికారి ఎన్. చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

ప్రశాంతంగా న్యాయవాద సంఘ ఎన్నికలు

శృంగవరపుకోట: ఎస్‌కోట న్యాయవాద సంఘ (బార్ అసోసియేషన్) ఎన్నికల్లో కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్, సహాయ ఎన్నికల అధికారి బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎన్నికల అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మండా కామేశ్వర రావు, జి.సూరిదేముడు వేసిన నామినేషన్లను బుధవారం సాయంత్రం 5 గంటల సమయం ముగిసే సమయానికి ఉపసంహరించుకోక పోవడంతో అధ్యక్ష పదవికి పోటీ అనివార్యమయిందన్నారు. కాగా న్యాయవాది సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యదర్శి బి.సత్యన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శి ఎల్.అప్పారావు, కోశాధికారి బి.త్రిమూర్తులను సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు. న్యాయవాద సంఘ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా పని చేయాలని మాజీ అధ్యక్షులు అల్లు సత్యాజీ, మాజీ కార్యదర్శి డబ్ల్యు.ఎన్. శర్మ తదితరులు సూచించారు.

ఎండియు కాటాలకు సీళ్లు

నెల్లిమర్ల: రేషన్ డిపోలు, ఎండియు తూనిక యంత్రాలకు లీగల్ మెట్రాజీ అధికార్లు సీళ్ళు అతికించారు. బుధవారం మండల కేంద్రంలో మండలంలో ప్రజా పంపిణీకు వినియోగించే రేషన్ డిపో, ఎండియు వాహనాల తూనిక యంత్రాల ముద్రలను ఇనస్పెక్టర్ ఎం. దామోదర నాయుడు తనిఖీ చేశారు. యండియు వాహనాల వద్ద తూకం కోసం వినియోగించే ప్రతీ తూనిక యంత్రాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సరిచేసి సీళ్లు వేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. సీళు వేయించుకోని వారిపై పంపిణీ సమయంలో తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎవరైనను తూకంలో తేడాలు చేస్తే తమ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులను కోరారు.

ఎన్నికల్లో పక్కాగా కోడ్ అమలు

నెల్లిమర్ల: ఎన్నికల్లో కోడ్ పక్కగా అమలు జరగాలని ఎంపిడిఒ జి.రామారావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన బుధవారం బొప్పడాం, సతివాడ, రామతీర్థం గ్రామాల్లో ఎన్నికల నియమావళి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కగా అమలు చేయాలని సూచించారు. పార్టీల నేతలు అనుమతి లేకుండా ఎటువంటి ప్రచారాలు చేయరాదన్నారు. నియమావళి అమలలో ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

బాడంగి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని ముగడ, కోటిపల్లి గ్రామాల్లో బొబ్బిలి ఎస్ఐ ఆర్.జయంతి ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు సయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత యుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించ వద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

అత్యాచార కేసులో 11 ఏళ్ల జైలు

రామభద్రపురం: 2017లో రొంపిల్లికి చెందిన ముదిలి కృష్ణపై కింతలి సోములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముద్దాయి కృష్ణకు 11 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా సెషన్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన కేసు వివరాల మేరకు.. ముద్దాయి కృష్ణ సోములు కుమార్తెను పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి లోబరుచుకొని అత్యాచారం చేయడంతో ఆమె గర్భం దాల్చింది. దీనిపై అప్పట్లో ఇక్కడ స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుని గుర్తించి కోర్టుకి తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్ర బాధితుల తరుపున వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు పూర్తైన తరువాత న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులకు జరిమానా

లక్కవరపుకోట: హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్, వాహన పత్రాలు సక్రమంగా లేకుండా నడుపుతున్న 12 మంది ద్విచక్ర వాహనదారుల వద్ద నుంచి రూ. 2825 అపరాధ రుసుమును బుధవారం స్థానిక ఎస్ఐ ఆర్ గోపాలరావు విధించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు సక్రమంగా ఉండాలని సూచించారు.

మట్టిపనులతో గ్రామాలపై ఇసుక తుపాను

- విమానాశ్రయ పనుల వద్ద నీటితో మట్టిని తడపని నిర్మాణ సంస్థ
- ధూళితో ఇబ్బంది పడుతున్న పది గ్రామాల ప్రజలు
- అరికట్టకపోతే వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరిక

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా మట్టి పనులు జరుగుతుండంతో వచ్చే ధూళితో సమీప ప్రాంతంలోని సుమారు పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం అయితే చాలు ఇసుక తుఫానులా గాలికి ఎగిరి గ్రామాలపైకి ఈ ధూళి రూపంలో ఎగిరిపడుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే తామే రోడ్డెక్కి పోరాటాలకు దిగుతామని, విమానాశ్రయానికి వెళ్లే వాహనాలను అడ్డుకుంటామని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

మండలంలో విమానాశ్రయం నిర్మాణం పనులు గత కొన్ని రోజులు నుంచి జరుగుతున్నాయి. ప్రస్తుతం మట్టి చదును పనులు చురుగ్గా చేపడుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఎర్రటి మట్టితో కూడిన ధూళి విపరీతంగా మధ్యాహ్నం సమయంలో గాలికి గ్రామాల్లోకి ఎగిరిపడుతుంది. ఒక్కోరోజు అయితే ఏకంగా ఇసుక తుఫానును తలపిస్తుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గూడెపువలస, రాళ్ళపాలెం, బైరెడ్డిపాలెం, దల్లిపేట, రెడ్డికంచేరు, దిబ్బలపాలెం, పిన్నింటిపాలెం, చేపలకంచేరు గ్రామల పరిస్థితిని చెప్పనక్కర్లేదు. ఇళ్ళలోకి ఎర్ర ధూళి గాలికి ఎగిరిపడుతుండడంతో ఇంట్లోని వస్తువులన్ని ఎర్రగా మారిపోతున్నాయి. గాలిలోని ధూళిని పీల్చడం వల్ల ఏమైనా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. చిన్నపిల్లలు ఊపిరితీసేందుకు ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. చివరకు ఆహార పదార్థాలు మూతలు తీయాలన్నా భయమేస్తుందని ఆవేదన చెందుతున్నారు.

నీటితో తడపకపోవడం వల్లనే ధూళి

మట్టి పనులు జరుగుతున్న చోట ఆయా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ధూళి ఎగరకుండా నీటితో తడపాలి. కాని నిర్మాణ సంస్థ అలాంటి చర్యలు ఏవీ చేపట్టడం లేదని ఈ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజు మధ్యాహ్నం గూడెపువలస, రాళ్లపాలెం గ్రామాల సమీపంలో విపరీతంగా గాలికి ఈ ధూళి ఎక్కువగా ఎగురుతోంది. చేపలకంచేరు రహదారిలో వెళ్ళాలంటే ఆ ప్రాంత వాసులు భయపడుతున్నారు. అంతేకాక ఒక్కోసారి ఈ ధూళికి ముందు నుంచి వస్తున్న వాహనాలు కూడా కనబడని పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఇంటిలో ఉన్న ప్రతి వస్తువును కడుక్కోవలసిన పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాంత ప్రజలందరం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలపైకి ధూళి రాకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..




గూడెపు వలస వద్ద ఎగురుతున్న ధూళి

మానవ మనుగడకు పరిశోధనలు కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఐసిజిఇబి డైరెక్టర్ డాక్టర్ రమేష్



డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న సెంచూరియన్ విసి

మానవ మనుగడకు పరిశోధనలు అత్యంత కీలకమని ఐసిజిఇబి (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ) డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వ విద్యాలయంలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కలిసి సంయుక్తంగా నిర్వహించిన మిపామ్-2024 (ఇంటరాక్టివ్ మీట్ ఆన్ మోలిక్యులర్ ఇంట్రికసీస్ ఆఫ్ ప్లాంట్) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆహార ధాన్యాల దిగుబడులు అధికంగా ఉండాలంటే పంటకు చీడ, పీడల బెడద ఉండరాదన్నారు. వీటిపై విస్తృత పరిశోధనలు జరిపి దిగుబడులు పెరిగేలా చూడాలన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వృక్ష శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి పరస్పర శాస్త్రీయ చర్చలు జరపడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశానికి ముఖ్యమైన ప్రాంతీయ సమస్యలను చేపట్టేందుకు యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి వీడియో సమావేశంలో మాట్లాడుతూ ఈ రంగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు విభిన్న సవాళ్లను ఎదుర్కోవల్సి ఉంటుందన్నారు. సెంచూరియన్ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ పరస్పర సహకారంతో జరుపుతున్న కార్యక్రమాలు చేపట్టడం వల్ల మంచి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత, డాక్టర్ అనిరుద్ధ్ కుమార్, డాక్టర్ సురేంద్ర కుమార్ రాయ్ తదితరులు ప్రసంగించారు. సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మోలిక్యులర్ బయాలజీ, తేజ్ పూర్ విశ్వవిద్యాలయం, విసిజిఐ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఐఐటి గౌహతి, ఆర్మీబి ఫరీదాబాద్ తదితర ప్రాంతాల నుంచి పలువురు పరిశోధకులు, గిరిజన విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ శరత్ చంద్ర, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, ప్రొఫెసర్ పి.శ్రీదేవి, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు కడితే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి- బొబ్బిలి

రోడ్లపై పశువులను కడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని మేదరవీధి, బంగారమ్మకాలనీ, యాతవీధి, గొల్లవీధి, బొప్పడపువీధిలో పారిశుధ్య పనులను ఆమె బుధవారం పరిశీలించారు. బొప్పడపువీధిలో రోడ్లపై పశువులు కట్టడంతో ఆమె తప్పు బట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పశువులను నివాసాలకు దూరంగా కట్టాలన్నారు. నివాస ప్రాంతాల్లో పశువులు కడితే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మేదరబంద ప్రధాన మురుగునీటి కాలువలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పారిశుధ్య విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజాంలో వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం

ప్రజాశక్తి- రాజాం

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాధరణ పొందిన వైభవ్ జ్యూయలర్స్ 14వ షోరూమ్ రాజాం శ్రీ సీతారామ కాంప్లెక్స్, పాలకొండ రోడ్‌లో బుధవారం ప్రారంభమైంది. ఈ షోరూమ్‌ను సీతారామ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సి.వి. జగన్నాధ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఆధరాభిమానాలతో విశాఖపట్నం, గాజువాక, గోపాలపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, పార్వతీపురం, బొబ్బిలి, శ్రీకాకుళం, విజయనగరం, దిల్‌సుఖ్‌నగర్, ఎ.ఎస్.రావ్ నగర్, హైదరాబాద్‌లో ఇప్పటికే బ్రాంచీలతో వైభవ్ జ్యూయలర్స్ (మనోజ్ వైభవ్ జెమ్స్ 'ఎన్' జ్యూయలర్స్ లిమిటెడ్) ప్రసిద్ధి పొందిందన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న డిజైన్లలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ప్లాటినం, రత్నాలు, వెండి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైభవ్ సంస్థల సి.ఎమ్.డి భారత మల్లికా రత్న కుమారి గ్రంధి, అమరేంద్ర గ్రంధి, సిఒఒ గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, కంకటాల టెక్స్‌టైల్స్ సిఎమ్‌డి కంకటాల మల్లిక్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జగన్నాధస్వామి తదితరులు

'జనసేనతో కలిసి పనిచేస్తాం'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈనెల 24న టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్ అన్నారు. బుధవారం టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవిశేఖర్ మాట్లాడుతూ టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం, వైసిపిని గద్దె దించడానికి ఐక్యంగా పని చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకి బహుమతి ఇవ్వడానికి టిడిపి శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని రవి శేఖర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, చింతపల్లి సత్యనారాయణ, అవనాపు సత్యనారాయణ, గురాన చక్రధర్, నల్లం శ్రీనివాస రావు, అట్టాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు రవిశేఖర్

జనసేనలోకి వైసిపి సర్పంచ్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చల్లవానితోట సర్పంచ్ పతివాడ వరలక్ష్మితో పాటు ఆమె భర్త కుమిలి పిఎసిఎస్ చైర్మన్ పతివాడ శ్రీను కొంత మంది అనుచరులతో జనసేన పార్టీ మండల అధ్యక్షులు జలపారి శివ అధ్వర్యంలో బుధవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు పంచాయతీకి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు మహంతి అప్పలనర్సమ్మ, కొల్లి రాజమ్మ, బందపు అప్పన్న తదితరులను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పతివాడ శ్రీను, వరలక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లను సర్వనాశనం చేసిన వైసిపిని వీడాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. పంచాయతీ నిధులు కొల్లగొట్టడం వల్ల తమ పరిధిలో గ్రామాలను కనీసం అభివృద్ధి చేయలేకపోయామని వాపోయారు. వైసిపిలో నాయకులకు, కార్యకర్తలకు కనీసం విలువ లేదన్నారు. నాయకుడుని కలవాలంటే లంచ్‌బాక్స్ పట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి అన్నారు. అందుకే విసిగి జనసేనలో చేరుతున్నట్లు తెలిపారు. జనసేన అభ్యర్థి లోకం మాదవి మాట్లాడుతూ ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపిస్తానని మీ అందరికి మాట ఇస్తున్నానని అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే రైతులను, కార్మికులను, యువతను, మహిళలను అభివృద్ధి పదంలో నడిపించే ఆలోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు నాయకులు లోకం ప్రసాద్, కారి అప్పలరాజు, కొలచిన రమేష్, జమరాజు, రాజవర్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎంసీ చైర్మన్‌ను కలిసిన మాధవి

భోగాపురం: మండలంలోని రావాడకు చెందిన టిడిపి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంతులూరి సూర్యనారాయణ మూర్తి రాజును టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి, కాకర్లపూడి శ్రీనివాసరాజు, లోకం ప్రసాద్ బుధవారం సాయంత్రం కలిశారు. పొత్తుల్లో భాగంగా రాబోయే ఎన్నికల్లో తనకు సహకరించాలని సూర్యనారాయణ మూర్తి రాజును కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి నియోజకవర్గ ఇన్చార్జ్ బంగార్రాజు, పెద్దలు నారాయణస్వామి నాయుడు సూచనలతో సహకరిస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ మాధవికి ఈసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. గ్రామంలోని ఇరు పార్టీలకు చెందిన కొంతమంది నాయకులను ఆయన లోకం మాధవికి పరిచయం చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్పంచ్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవి

పరీక్షా కేంద్రాల్లో కరెంటు కోత

ప్రజాశక్తి- మెరకముడిదాం

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యుత్తు లేకపోవడంతో పరీక్ష రాసిన విద్యార్థులు బుధవారం ఇబ్బంది పడ్డారు. గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలు కారణంగా విద్యుత్తు సమస్య ఏర్పడింది. మెరకముడిదాం, గర్భాం ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో అక్కడ కరెంటు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. ఒక పక్క వర్షం పడటంతో వెలుతురు లేక, కరెంటు లేక పరీక్ష రాయడానికి తంటాలు పడ్డారు. వర్షం పడటంతో విద్యార్థులకు కేంద్రాలకు చేరుకోవడం ఒక సమస్య అయితే అక్కడ కరెంటు లేకపోవడం మరో సమస్యగా విద్యార్థులు నరకయాతన పడ్డారు. అధికారులు దృష్టి పెట్టి విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలూ కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా : బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన అన్నారు. స్థానిక రాజా నగర్ కాలనీ, అమ్మిగారి కోనేరు గట్టుపై బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. బేబినాయనకు మద్దతుగా ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన ప్రచార కార్యదర్శి బాబు పాలూరి పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టిడిపి కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

వంగర : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాకారమవుతోందని మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉదయాన మురళీ కృష్ణారావుతో పాటు 300 వైసిపి కుటుంబాలు, ఓని అగ్రహారం గ్రామానికి చెందిన 50 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి కోండ్రు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల శంఖారావంలో టిడిపికి అఖండమైన మెజారిటీని ఇచ్చి గెలిపించాలని కోండ్రు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి మోహన రావు, కిమిడి అశోక్ కుమార్, గురవాన నారాయణ రావు, బెజ్జి పురపు రవి, మజ్జి గణపతి, మజ్జి శ్రీనివాసరావు, దుప్పలపూడి శ్రీను, వల్లూరి గణేష్, వంగా వెంకటరావు, దూబ ధర్మారావు, జరజాన నీలయ్య తదితరులు పాల్గొన్నారు.



దోశ వేస్తున్న బేబినాయన

అందరూ కలిసి గెలిపించాలి

గంట్యాడ: రానున్న ఎన్నికలలో గజపతినగరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని టిడిపి, జనసేన,బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం కొఠారిబిల్లి, నీలావతి గ్రామాలకు చెందిన కొంతమంది టిడిపి నాయకులు శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి గ్రామంలో వివరించి రానున్న ఎన్నికలలో ఓట్లు వేయించడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలోకి వలసలు

దత్తి రాజేరు: మరడాం గ్రామంలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ సర్పంచ్ కర్రి పైడమ్మ, మాజీ ఎంపిటిసి కర్రి అప్పల నాయుడు, సలాది గోపి, సురా బత్తుల సూర్యనారాయణ, కర్రి ఆదినారాయణ, వజ్జి అప్పలస్వామితో పాటు మరో 50 కుటుంబాలు టిడిపిలో చేరగా, పలువురు యువకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, జనసేన నాయకులు, మాజీ మంత్రి పడాల అరుణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైభవంగా సీతారామ కళ్యాణం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో బుధవారం సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి రామనామ స్మరణతో గ్రామం మారు మ్రోగింది. ఈ మహోత్సవంలో భాగంగా కోలాటాలు, బ్యాండ్ మేళాలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలతో ఊరేగింపుగా రామాలయానికి భక్తులు చేరుకొని సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విశాఖకు చెందిన పల్సర్ బైక్ ఝూన్సీ టీం డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఎంపిటిపి టివి రమణ పాల్గొన్నారు.



వేపాడ: ఊరేగింపుగా వెళుతున్న యాత్రికులు

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

మండలంలోని వావిలిపాడు పంచాయతీ పరిధిలో గల కడకొండ గ్రామ దేవత ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు వైసిపి నాయకులు బీల సతీష్ నగదు బహుమతులు ప్రదానం చేశారు.



గుర్ల: ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్‌పి చైర్మన్

ఘనంగా ఆలయ ప్రతిష్ట

గుర్ల: మండల కేంద్రంలో శ్రీదేవి, భూమాత సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రాజాం నియోజకవర్గ పరిశీలకులు కెవి సూర్యనారాయణరాజు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, జిల్లా పశుసంవర్ధక చైర్మన్ బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.